# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- గతంలో అన్నదాతలకు అడుగడుగునా కష్టాలు..
- ప్రస్తుతం రాష్ట్రంలో పండుగలా వ్యవసాయం
- 24 గంటల కరెంట్ ఇచ్చేటోళ్లు కావాల్నా.. 3 గంటలు ఇచ్చేటోళ్లు కావాల్నా
- మాయ మాటలకు ప్రజలు ఆగం కావొద్దు..
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- మహ్మద్‌నగర్ మండల ప్రారంభోత్సవం

నిజాంసాగర్, అక్టోబర్ 1: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చేటోళ్లు కావాల్నా.. మూడు గంటల కరెంట్ ఇచ్చేటోళ్లు కావాల్నా అని పేర్కొన్నారు. మండలంలోని మహ్మద్‌నగర్‌ను ఇటీవల నూతన మండలంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన మండలాన్ని ఆదివారం కవిత ప్రారంభించారు. ముందుగా మహ్మద్‌నగర్‌కు చేరుకున్న ఆమెకు మండల ప్రజలు ఘనంగా బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం నూతన తహసీల్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఎన్నికలు వస్తున్నాయంటే ఇతర పార్టీల నాయకులు వట్టి మాటలు చెబుతారని, ఇలాంటి పరిస్థితుల్లో ఆగం కావద్దని సూచించారు. హనుమంతుడి గుడి లేని ఊరు లేదని, కేసీఆర్ ఫలాలు అందని ఇల్లు లేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయంటే చాలా మంది వచ్చి ఏవేవో మాటలు చెబుతారని అన్నారు. చెప్పేటోళ్లు ఎవరు, చేసేటోళ్లు ఎవరు గమనించాలని సూచించారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే తెచ్చుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఇప్పుడు తెలంగాణలో ఆ పరిస్థితి లేదని అన్నారు. యూరియా బస్తాల కోసం కష్టాలు పడే కాలం పోయిందన్నారు. అన్ని వర్గాల గురించి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ ఆలోచిస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. గతంలో ప్రభుత్వాలు వచ్చాయి, పోయాయి కానీ ప్రజల కోసం పనిచేసిన ప్రభుత్వం చూడలేదన్నారు. మానవత్వం ఉన్న మనిషి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని అన్నారు. 24 గంటల విద్యుత్తు, రైతు బంధు, పింఛన్ వంటి అనేక పథకాలు మన రాష్ట్రంలోనే అమలుచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ రూ.2.9 లక్షల కోట్లుగా ఉంటే అందులో పింఛన్‌లకే రూ.45వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. కొత్త మండలం కల సాకారం చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు కృషి ఎంతో ఉందని అన్నారు. వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి సీఎం కేసీఆర్‌తో మీ ఎమ్మెల్యే ప్రతి రోజూ చర్చించేవారన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభరాజు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఎంపీపీ పట్లోల్ల జ్యోతి దుర్గారెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షిండే, జడ్పీ చైర్‌పర్సన్ శోభ

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సస్యశ్యామలం

- కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట బిల్లులు మింగేశారు
- అనవసరంగా చిల్లర రాజకీయాలు, అల్లరి చేస్తే భయపడే ప్రసక్తే లేదు
- రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు: సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి
- కోటగిరి మండలం కల్లూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న స్పీకర్
- బాన్సువాడలో ఆర్యవైశ్య సంఘ భవన ప్రారంభోత్సవం



బాన్సువాడలో ఆర్య వైశ్యసంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి, అక్టోబర్ 1: ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి కేసీఆరే సీఎం కావడం ఖాయమని, బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సస్యశ్యామలమవుతుందని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో రూ.8 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి ఆదివారం శంకుస్థాపన, ప్రారం భోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ కేసీఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 4.70 లక్షల మంది బీడీ కార్మికులకు పింఛన్లు ఇస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. కాళేశ్వరం ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిని నింపి రెండు పంటలకు సాగునీటికి ఢోకా లేకుండా చేశారని తెలిపారు. నియోజకవర్గంలో పెద్దమొత్తంలో అభివృద్ధి చేస్తుం టే .. ఇతర పార్టీల నాయకులు రాజకీయం, అల్లరి చేస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. ఏదైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. మనస్సు నొప్పించే పని చేయవద్దన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్ల పేరిట దోపిడీ**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ పథకం పేరిట ఆ పార్టీ నాయకులు ఇండ్లు కట్ట కుండానే కోట్ల రూపాయల బిల్లులు తినేశారని మండిపడ్డారు. ఒక్క కల్లూర్ గ్రామంలోనే 252 ఇందిరమ్మ ఇండ్లు కట్టినట్లు రికార్డులు చూపించి.. కాంగ్రెస్ నాయకులు, అధికారులు కుమ్మక్కై రూ.2 కోట్లు మింగేశారని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక పక్క నియోజకవర్గంలో కేవలం 14 వందలు డబుల్ బెడ్ రూం ఇండ్లు వస్తే బాన్సువాడ నియోజకవర్గంలో 11 వేల డబుల్ ఇండ్లు నిర్మించి అర్హులకు పంపిణీ చేశామన్నారు. రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం కింద ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. ఈసందర్భంగా కల్లూర్‌లో 58 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు.

**బాన్సువాడలో ఆర్యవైశ్య సంఘ భవన ప్రారంభోత్సవం**

బాన్సువాడ, అక్టోబర్ 1: బాన్సువాడ పట్టణంలో రూ. కోటితో నిర్మించిన ఆర్యవైశ్య భవనాన్ని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆర్య వైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ.. 2009 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, ఆ సమయంలో బాన్సువాడ ఆర్యవైశ్యులు తమ సంఘానికి నిధులు కావాలని కోరుతూ అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వద్దకు వెళ్లి వినతి పత్రాన్ని ఇవ్వగా.. చెత్తకుప్పల్లో పడేశారని గుర్తుచేశారు. అప్పట్లో ఒక్కో ఎమ్మెల్యేకు నియోజక వర్గానికి కేవలం 50 లక్షల రూపాయలు మాత్రమే సీడీపీ నిధులు ఇచ్చే వారని తెలిపారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సహకారంతో భారీగా నిధులు మంజూరుచేయడంతో బాన్సువాడ నియోజక వర్గంలోరూ. కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. బాన్సువాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ నెల4వ తేదీన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రానున్నారని, ఈ నేపథ్యంలో ఆర్యవైశ్యులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

# పల్లెల సమగ్రాభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు, అక్టోబర్ 1: పల్లెల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో రూ.27.81 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేడు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని తెలిపారు. గ్రామాలతోపాటు మండలాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి , జడ్పీటీసీ పద్మ, ఏఎంసీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సర్పంచ్ తునికి వేణు, ఉప సర్పంచ్ నరేశ్, ఎంపీటీసీలు సువర్ణ, చంద్రకళ, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ రాంచంద్రం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజమౌళి, నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బీజేపీ కాలం చెల్లిన పార్టీలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- ఆ రెండు పార్టీలకు భంగపాటు తప్పదు
- అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు
- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబరు 1: బీజేపీ, కాంగ్రెస్ కాలం చెల్లిన పార్టీలని, ఆ రెండు పార్టీలకు తెలంగాణలో భంగపాటు తప్పదని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలోని అమ్దాపూర్, సీహెచ్ కొండూర్, వెల్మల్, అయిలాపూర్, అడవి మామిడిపల్లి, పెర్కిట్ వీడీసీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన కుల సంఘాల సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ రథసారథి సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రజలే ఈ ప్రభుత్వానికి వారధి అని తెలిపారు. సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని, అభివృద్ధి చేయని ఊరులేదన్నారు. మన రాష్ట్రం మనకు రాకుంటే ఇంత అభివృద్ధి చూసేటోళ్లమా ?తెలంగాణ వస్తే ఏమొస్తదన్న సన్నాసులకు కేసీఆర్ అద్భుతమైన పాలనే దీటైన సమాధానమని పేర్కొన్నారు. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర తిరగరాయడం తథ్యమని జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని డ్రామాలు చేసినా మళ్లీ బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ గడ్డ అభివృద్ధికి అడ్డాగా మారిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణను దేశంలోకెల్లా అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని , తన జీవితం ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలకే అంకితమన్నారు.ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- జుక్కల్ మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



సెంట్రల్ లైటింగ్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షిండే

నిజాంసాగర్, అక్టోబర్ 1: సీఎం కేసీఆర్ హయాంలోనే జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. ఆయన ఆదివారం జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్ గ్రామంలో 'మన ఊరు – మన బడి' నిధులు రూ.1.40 కోట్లతో నిర్మించిన పాఠశాలను ప్రారంభించారు. అనంతరం జుక్కల్‌లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు శిలాఫలకం ఆవిష్కరించారు. జుక్కల్, డోన్‌గావ్, ఖండెబల్లూర్ గ్రామాల్లో రూ.23 లక్షలతో నిర్మించిన రైతు వేదిక భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 50 సంవత్సరాలపాటు పాలించిన ప్రభుత్వాలు జుక్కల్ నియోజకవర్గాన్ని ఏనాడూ పట్టించుకోలేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో బీటీరోడ్ల నిర్మాణం పూర్తిచేశామని, సాగునీటి కోసం నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు చేపడుతున్నామని అన్నారు. రైతులు సమావేశాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రతి క్లస్టర్ పరిధిలో రైతువేదిక భవనాలు నిర్మించినట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీపీ యశోద, బీఆర్ఎస్ నాయకులు నీలూపటేల్, సాయాగౌడ్, మాధవరావుదేశాయి, బొల్లి గంగాధర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.